అదా కారణం!

డాక్టర్ 'గిరి'

ఆ వేళ 'కలకత్తా మెయిలు' యిరవై నిముషాలు 'లేటు' అయినందువల్ల, బెజవాడ స్టేషనులో రైలు నిలిచేసరికి మావారి 'రిష్టువాచి'లో ఏడుగంటల అయిదు నిమిషాల వేళైంది. మా వారి వాచి యెప్పుడూ అయిదు నిమిషాలు హెచ్చించే పెట్టబడి ఉంటుంది కాబట్టి అప్పుడు సరిగ్గా ఏడుగంటలే అన్నమాట! ముందు రాత్రి చెన్నపట్నంలోచేసిన భోజనం, తిన్న చిరుతిళ్లూ, అన్నీ అప్పటికి పరిపూర్ణంగా జీర్ణమై పోయినందువల్ల కాబోలు, కడుపులో ఆకలి 'కమ కమ' మంటూ ఉంది. అందువల్ల మావారితో యిలా అన్నాను.

"ఏమండీ! రైలు నిలిచి అయిదు నిమిషాలైనా అయి ఉంటుంది. మీకేమీ ఆకలికావడం లేదేమో గాని నాకు మాత్రం ..."

"మంచిదానివే! నాకు మాత్రం ఆకలవడం లేదనుకొన్నావా! వీళ్లందర్నీ త్రోసికొంటూ, రైలు దిగి, ప్లాట్‌ఫారంమీద పడేంతలో మళ్లీ రైలెక్కడ బయలుదేరుతుందో అని భయపడుతున్నాను" అన్నారాయన.

"మరేం ఫరవాలేదు. అరగంటకి పైగానే నిలబడుతుంది. మరచెంబు ఖాళీచేసి ఉంచాను. ఏమి లేకపోయినా, యిన్ని కాఫీ నీళ్లైనా పట్రండి మీ పుణ్యం ఉంటుంది" అన్నాను.

మావారు ధైర్యంచేసి, ప్రయాణీకులతో క్రిక్కిరిసి ఉన్న మూడోతరగతి పెట్టెలోంచి, ఒక్కొక్కర్ని మెల్లిగా తప్పించుకొంటూ, 'ఏమిటయ్యా కాలు తొక్కేశావు' అనే ప్రయాణీకుణ్ణి మంచిచేసుకుంటూ, ప్లాటుఫారంమీదికి ఊడిపడేసరికి యెంతలేదన్నా పదినిమిషాలు పట్టిఉంటుంది. 'ఖాళీ' మరచెంబును నేను కిటికీలోంచి, ఆయన కందించి, 'అమ్మయ్య! ఇహ కాఫీ దొరికిందన్నమాటే' అని మనసు నిబ్బరం చేసికొని, "బెజవాడ స్టేషనులో 'కాఫీ' ఎలా ఉంటుందో" అని నేను అనుకొంటూన్నంతలో మావారు 'గబగబ' పరుగెత్తుకొంటూ రావడం చూచాను.

"అనుకొన్నట్టు ఒట్టి కాఫీ మాత్రమే తెస్తున్నారు. ఓ రెండు యిడ్లీ ముక్కలుకూడా తెస్తేనేమో!" అని తల్చుకొంటూ, కిటికీవద్దకు సమీపించిన, ఆయన చేతిలోని మరచెంబును అందుకోబోయాను.

"అందులో ఏముంది — నీ మొహం! 'పర్సు' పట్టుకెళ్లకుండా వెళితే, కాఫీ ఎలా వస్తుంది? వేగంగా 'పర్సి'లా యియ్యి" అన్నారాయన. 'కాఫీ అయినా దొరుకుతుందికదా' అని అనుకొంటూన్న నాకు కొంచెం ఉత్సాహ భంగం కలిగినప్పటికీ, వెంటనే ఆయన విడిచివెళ్ళిన కోటుజేబులోఉన్న పర్సునుతీసి, ఆయనచేతి కిచ్చాను. ఆయన మళ్ళీ పరుగెత్తుకొంటూ వెళ్లారు.

అంతలో మా 'పెట్టె'లోనికి ఒక పురుషుడు ఎక్కుటకు ప్రయత్నించాడు. తలుపుదగ్గర 'ద్వారపాలకుల్లాగ' కూర్చున్న ప్రయాణీకు లాతనితో "ఎలా ఎక్కుతావయ్యా బాబూ! పోనీ నువ్వొక్కడివేయేమో అనుకుంటే నీతోకూడా 'ఆవిడ' ఆవిడతోకూడా 'బిడ్డ'! ఈ పెట్లో నిలబడ్డానికైనా జాగాలేదే!" అని అన్నారు.

"ఎలాగోలాగ గడుపుకోవాలిమరి — ఏ పెట్లోనూ జాగాలేదాయం - ఏంచెయ్యగలం? అలాగని ప్రయాణం మానుకోగలమా?" అన్నాడా క్రొత్తాయన.

'రైలు బయలుదేరే సమయం' అని తెలియజేస్తూ మొదటి 'గంట' వినవచ్చింది. ప్లాటుఫారం, జనసమూహంతో నిండిఉంది. మావారు వచ్చేజాడ

కనబడ్డంలేదు. 'దిక్కుమాలిన కాఫీ లేకపోతేనేం! ఆయన్ని మళ్లా యెందుకు వెళ్లనిచ్చాను' అని అనుకొంటూండేసరికి రెండో 'గంట' వినబడింది. ప్లాటుఫారంలో 'హడావిడి' ఎక్కువైంది. ఇటు పరుగెత్తేవారు, అటు పరుగెత్తేవారు. వాళ్ల మధ్యలో పండ్లు, ఫలాహారాలు అమ్మేవాళ్లూ! 'గార్డు' యీలవేసిన శబ్దంకూడా వినబడింది. మావారి 'ఫికరు'లేదు.

క్రొత్తగా వచ్చిన ప్రయాణీకుడు తన చేతిలోని పెట్టెను, హోల్డాలును రైలు పెట్టెలో క్రుక్కి, తన వెనుకనున్న స్త్రీని, బిడ్డను లోపలికి ఎక్కించాడు. అంతతో అక్కడఉన్న కాస్త జాగా పూర్తి అయింది. 'అతను ఎలా ఎక్కుతాడు? ఆ విడ అడ్డంగా నిల్చుంటే మావారు లోపలి కెలా వస్తారు?' అనే సందేహం కలిగింది నాకు. మూడో 'గంట' శబ్దం వినబడింది. మావారు రావడం కనబడింది. ఆయన యెడమచేత్తో మరచెంబునూ, కుడిచేత్తో ఒక పొట్లమును పట్టుకొని పరుగెత్తుకొంటూవచ్చి, వానిని కిటికీలోనుంచి నాచేతి కందిచ్చారు. అంతలో రైలు కదిలినట్లైంది — కదిలిందికూడాను. 'వేగిరం ఎక్కండి' అని నేనాయన్ని తొందర పెట్టేను. ద్వారంలో నిలబడిఉన్న ఆ స్త్రీని తగిలీ తగలకుండా, ఒకరిద్దరి కాళ్లుమట్టి, ఎలాగోలాగ లోపలికివచ్చి ఆయన జాగాలో ఆయన కూర్చున్నారు. క్రొత్త ప్రయాణీకుడు 'మెట్టు'మీద నిలబడి, సగము తలుపువేసికొని ఉన్నాడు. నేను మెల్లిగా 'పొట్లము'నువిప్పి అందులోఉన్న రెండు యిడ్డెన్లు, రెండు గారెలుతీసి, ఆయనముందు పెట్టేసరికి 'నావంతు అక్కడే తినేశాను. ఇవన్నీ నీకే' అన్నారాయన.

'అందుకేనా యింత ఆలశ్యం అయింది!' అని అంటూ ఫలాహారం చేయుటకు ఉపక్రమించాను. మావారు ప్రయాణీకులవైపుచూస్తూ 'ఇదుగో శారదా! అక్కడ పిల్లని ఎత్తుకొని నిలబడిందే, ఆవిడను ఇలా వచ్చి కూర్చోమను!' అన్నారు నాతో.

"ఆ విడ కూర్చోడానికి జాగా యెక్కడఉంది?" అన్నాను నేను.

'జాగాకేమిటి? నేను అలావెళ్లి నిల్చుంటాను. ఆమెను కూర్చోమను' అన్నాడాయన.

ఆయన పరోపకారబుద్ధి బాగానే ఉందికాని, ఆయన కష్టపడి ఒకరికి జాగా యివ్వడం నాకంతగా నచ్చలేదు. అందువల్ల "తనకుమాలిన ధర్మం-మొదలు చెడ్డబేరం అంటారు కదా? మీరు శ్రమపడుతూ మరొకరికి చోటివ్వడం ఏమిటి? ?" అన్నాను.

"నీకు తెలియదులే! మొదటామెను పిలువు." అని శాసించారాయన.

'సరే' ననుకొని "ఇదిగో అమ్మాయిగారూ! ఇలా రండి. ఇక్కడకూర్చోండి. పాపం! బిడ్డతోకూడా ఎంతసేపని నిలబడతారు గనక!" అని గట్టిగా అరచాను; రైలుశబ్దానికంటే యెక్కువగానే. మావారు అప్పటికే, ఎడమచేతివైపున ఉన్న కిటికీ దగ్గరకు వెళ్లి నిలబడి, తను కూర్చుండిన జాగా 'ఖాళీ' చేశారు.

ఆ 'అమ్మాయికి' నామాటలు వినిపించినందువల్ల, ఆమె అట్టే మొగమాటం పడకుండా మెల్లిమెల్లిగా నా ప్రక్కకు వచ్చి కూర్చుంది. అప్పటికి నేనొక యిడ్డెను ఒక గారె మాత్రమే తినగలిగాను. అవి ఇంకా గొంతుకదిగినట్లులేదు. అందువల్ల కొద్దిగా నీళ్లుత్రాగి, 'కాఫీ' చల్లారి పోతుందనే భయముతో మరచెంబు మూతతీశాను. కాఫీని గ్లాసులోపోసికొని కొద్ది కొద్దిగా త్రాగుతూ, అప్పుడప్పుడు ప్రయాణీకులవైపు, మావారివైపు చూడడం మొదలు పెట్టేను. 'మెట్టు' మీదనిలబడిన ప్రయాణీకుడు లోనికివచ్చి తలుపువేసికొన్నాడు. మా వారు ఎందుకో చిరునవ్వు నవ్వేరు. నన్నుచూసే నవ్వుతున్నారేమో అని అనుకొన్నాను. నేనుకూడా నవ్వుముఖం పెట్టేను; కాని అంతలోనే నాప్రక్కనున్న యువతి మందహాసం చేయడం కనిపించింది. 'ఎవరిని చూచి నవ్వుతోందా? అని అనుకొంటూ మావారి ముఖం చూచాను. ఏమిచిత్రం! వారిద్దరు, ఒకరిని చూచి ఒకరు నవ్వుకొంటున్నారని గ్రహించాను. 'మావారికీమె పరచయస్థురాలా? అందుకే మావారామెకు తన 'జాగా'ను యిచ్చి గౌరవించి ఉంటారా' అని దీర్ఘంగా ఆలోచించాను.

అంతలో, తలుపువద్ద నిలబడియున్న పురుషుడు నా వైపు సాభిప్రాయంగాచూసి, నా ప్రక్కనున్న యువతితో "రాజీ! బిడ్డకు 'హార్లిక్సు' పొయ్యావూ?" అని ప్రశ్నించాడు.

"పెట్టిలోంచి తీసి యియ్యండి పోస్తాను" అంది ఆవిడ.

ఆ యువతిపేరు 'రాజమ్మో రాజ్యమో, రాజ్యలక్ష్మో' అయి ఉంటుందని ఊహించి "ఏమండీ రాజ్యలక్ష్మిగారూ! ఆయన మీకు..." అని అనబోయేసరికి

"నాపేరు రాజలక్ష్మి కాదులెండి. నాపేరు రాజ్యం. ఆయన నా పెనిమిటి" అని ఆమె పటపటమని, 'జంకు గొంకు' లేకుండా చెప్పింది.

"మీరెంతవరకు ప్రయాణం?" అన్నాను.

"బరంపురం వరకేలెండి" అన్నదామె, ఏదో ప్రక్కనే ఉన్న స్టేషను అన్నట్టుగా. నిజానికి చూస్తే ఆ వేళ రాత్రి పన్నెండు గంటలవుతుంది బరంపురం చేరేసరికి! మా వారు ఎంతసేపని నిలబడవలసి వస్తుందో అనే పరితాపం నాకుకలిగింది. ' ఆయన ముఖంలో మాత్రం ఎట్టి కష్టమనీతోచినట్లు కనబడ లేదు. అంతలో ఆమెనన్ను చూచి "మీపేరేమిటి?" అంది. నాపేరు 'శారద' అని అన్నాను. "మీరెంతవరకు ప్రయాణం?" అంది మళ్లీ. "కలకత్తావరకు" అన్నాను. "అమ్మయ్యో! రేపు ప్రొద్దుట పదిగంటల వరకూ ప్రయాణం చెయ్యాలే" అంది ఆవిడ. "అవును" అన్నాను నేను. "కలకత్తాలో ఏమిటి విశేషం?" అంది ఆవిడ. "మావారికి ఉద్యోగమైంది." అన్నాను. "సంతోషం! మీరు అదృష్టవంతులు. అదృష్టవంతుల్ని చెరిపేవారూ లేరు, దురదృష్టవంతుల్ని బాగుచేసేవారూ లేరు" అంది ఆవిడ.

"మీవారికేం పని?" అన్నాను.

"భోజనం" అంది.

"అదేమిటలా అంటారు? హాస్యాని కంటున్నారా?"

"హాస్యంలేదు గీస్యంలేదు. నిజమే చెబుతున్నాను. అయిదేళ్లకు పూర్వం ఆయనకు కొంత ఆస్తి ఉండేది. అప్పట్లోనే నన్నాయన కిచ్చి, నిక్షేపంవంటి సంబంధంవద్దని విడిచిపెట్టి, ఆస్తి ఉందికదా అని నన్ను ఆయనకేయిచ్చి పెండ్లిచేశారు. ఇప్పుడీగతికి వచ్చాము" అన్నదావిడ.

"ఇప్పుడేమైందో చెప్పలేదే?" అన్నాను నేను.

"ఆస్తిపోయింది. అప్పులు మిగిలాయి. స్కూలు ఫైనలు పాసయారుగాని చిన్న ఉద్యోగాలంటే పరువుతక్కువ. పెద్ద ఉద్యోగాలు దొరకవు" అన్నదామె.

"ఆస్తి ఎలాపోయిందైతే?" అన్నాను నేను.

"ఏవో గుఱ్ఱపుపందెములనీ, అవనీ, యివనీ అనేక మార్గాల్లో పోయింది. ఎలా పోతేనేం? పోవడం నిజం." అందామె.

"అయ్యోపాపం!" అని అంటూ నా సానుభూతిని ప్రకటించాను. అంతలో ఆమె భర్త పెట్టె తెరచి 'హార్లిక్సుబుడ్డి, ప్లాస్కు' అందిచ్చాడు. ఆమెకన్నా నేనే సమీపంలో ఉన్నందువలన, నేనేవానిని అందుకొని రాజ్యానికిచ్చాను. నేనతనివద్దనుండి వానిని అందుకొనేటప్పుడుఅతడు నన్నుచూచి నవ్వేడు. నన్ను చూచి అతడెందుకలానవ్వుతున్నాడో నాకర్థంకాలేదు. "మీకు అత్తగారూ, మామగారూ, ఉన్నారా?" అని ఆమెను ప్రశ్నించాను. "మామగారు మరణించి పదేళ్లైంది. అప్పటికి నాకు పెళ్లేకాలేదు కాబట్టి ఆయన ఎలా ఉండేవారోకూడా నాకు తెలియదు. అత్తగారు ఉన్నారు. ఆడుది. ఆమె యేమి చేయగలదు?" అందామె.

"వాళ్లదేవూరు?"

"నెల్లూరు."

"ఇంటి పేరో?"

"గోరోజనంవారు."

"గోరోజనంవారా? మీ ఆయనపేరు ప్రసాద రావుగారు కదా?"

"అవును. మీకెలా తెలుసును ?"

"నన్నాయన కివ్వాలని ఒకప్పుడు ప్రయత్నం జరిగింది. పెళ్లి చూపులకని ఆయన మా యింటికి వచ్చారు. నేనాయనను అంత బాగా చూచుటకు సిగ్గుపడ్డాను; కాని నేనే ఆ పెండ్లికి సమ్మతించలేదు. అందువల్ల ఆ సంబంధం తప్పిపోయింది" అన్నాను.

"బ్రతికారు! ఇంతకీ నాకూ ఆయనకి 'ముడి' పడి ఉండగా మీకాగ్రహచారం ఎలాపడుతుంది' నన్ను మీవారికిచ్చేందుకుకూడాఅలాగే ప్రయత్నాలు జరిగాయి. నేను సరేనన్నాను; కాని మా అమ్మ ఒప్పుకోలేదు. 'ఆస్తి,' లేనివాడు నీకెందుకమ్మా! కొంచెం కట్నం ఎక్కువైనా ఆస్తి ఉన్నవాడినేచేసికోవడం మంచిది" అని మా అమ్మ అడ్డుపడింది. అని అంటూ ఒక పెద్ద నిట్టూర్పు విడిచిందామె.

ఆమె మావారు నవ్వుకోడానికీ, నన్ను చూచి ఆమె పెనిమిటి నవ్వడానికి కారణం తెలిసింది. "రాజ్యం గారూ! విచారించకండి. కష్టాలు కాపురముండవు. ఇంతకీ 'ఘటని' ఎలాఉందో అలా జరుగుతుంది." అని ఆమెను ఓదార్చాను.

ఏ జం ట్లు కా వా లి!

బొంబాయి, హైదరాబాద్, సికందరాబాద్, విశాఖపట్టణం, కర్నూలు, గుంటూరు, బాపట్ల, ఒంగోలు, చిత్తూరు, కడప, గూడూరు, తిరుపతి, బరంపురం, బెంగుళూరు – యింకా యితర ప్రదేశాలలో మాపత్రికలు అమ్మబడని చోట్లలో తమస్వంత బాధ్యతపై అమ్ముటకు ఏజంట్లుకావలెను.

ఏజంట్లుగానుండగోరువారికి రు 100/-కి రు 20/-లు కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును. ఇతర వివరములకు వ్రాయండి!

మా పత్రికకు అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయాల నివ్వగలము.

గృ హ ల క్ష్మి కా ర్యా ల యం

రాయపేట, మద్రాసు 14.